క్లుప్తంగా

ఆళ్వార్‌దాస్ సేవలు చిరస్మరణీయం

ఏలూరు రూరల్: ఏలూరులోని అల్లూరి సీతా రామరాజు స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆళ్వార్‌దాస్ జయంతి నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, కార్యదర్శి ప్రత్తిపాటి నాగ విఘ్నేశ్వరరావు, ట్రెజరర్ విశ్వనాథ మాధవరావు, మహిళా అసోసియేషన్ సెక్రటరీ మేరీ మాణిక్యం, డైరెక్టర్ గొంతిన రామకృష్ణ, సముద్రాల పద్మావతి, శోభ, జంపా సూర్యనారాయణ, ఏసు, జల్లా వీరభద్రరావు, తదితరులు ఆళ్వార్‌దాస్ చేసిన సేవలు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పైడిచింతపాడులో పింఛన్ల పంపిణీ పూర్తి

ఏలూరు రూరల్: మండలంలోని పైడిచింతపాడులో పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎండీపీవో వి.శ్రీలత చెప్పారు. గురువారం ఉదయం సచివాలయంలో ఉద్యోగులు పింఛన్ డబ్బులు సరి చూసుకుంటున్న సమయం పింఛన్ పంపిణీ చేస్తున్నారంటూ కొందరు వ్యక్తులు అపోహపడ్డారని వివరించారు. ఆమెతో పాటు తహశీల్దార్ అంతర్వేది శ్రీనివాస్ ఉన్నారు. మరో పక్క సర్వర్ సమస్య ఏర్పడడంతో పలు గ్రామాల్లో పింఛన్ పంపిణీ కొన్ని గంటలు ఆలస్యమయ్యింది.

ఆక్రమణ భూమిపై విచారణ చేయాలి



డీఆర్‌వో విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న దళితసేన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆక్రమణకు గురైన సాగుభూమిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని దళితసేన విజ్ఞప్తి చేసింది. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావును దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం మఠం గూడెం గ్రామానికి చెందిన దాదినిబోయిన చంద్రశేఖర్ సాగు భూమి ఇటీవల ఆక్రమణకు గురైందని, ఆ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని రవి ప్రకాష్ కోరారు.

ఏలూరులో అగ్నిప్రమాదం

ఏలూరు టౌన్: ఏలూరులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిందని ఏలూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఏలూరు రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక ప్రైవేట్ క్రాకర్స్ అండ్ మూవర్స్ కార్యాలయంలో ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ హుళక్కేనా?

- సాగుదారులకు సాయం అందేనా?
- నేటికీ అమలు కాని పథకం
- ఆశగా చూస్తున్న రైతన్నలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.18.30 కోట్ల అందజేత

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఈ ఏడాది అమలు చేయదనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతుంది. అందువల్లనే చంద్రబాబు పథకం ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటన కూడా చేయలేదంటున్నారు. ప్రభుత్వం సెప్టెంబర్‌లో సాయం చేస్తుందని రైతులు ఆశ పడ్డారు అదీ లేదు. అక్టోబర్ కూడా అయిపోయింది. నవంబర్ వచ్చేసింది. నేటికీ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పథకం గురించి మాట్లాడం లేదు. దీంతో రైతుల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది పథకం అటకెక్కిస్తుందనే ఆందోళన మొదలయ్యింది.

పెట్టుబడి లేదు

ఇటీవల వచ్చిన వరదలకు ఏలూరు రూరల్ మండలంలో పెద్ద ఎత్తున వరి చేలు నీట మునిగిన సంగతి తెలిసిందే. చేలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అదనపు ఖర్చు చేయవలసి వచ్చింది. గట్లు వేసేందుకు, పురుగు మందులు చల్లేందుకు చేసిన అప్పు, చేతిలో డబ్బు కూడా ఖర్చు అయిపోయాయి. ఇప్పుడు రాబోయే 40 రోజుల్లో ఎరువులు, కోతలు, కుప్ప నూర్పిళ్లకు మరోసారి అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6000 అందిస్తే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మరో రూ.7500 జమ చేసి రైతులకు అందజేశారు. కౌలు రైతులకు మాత్రం మొత్తం రూ 13,500 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. మొత్తంగా రైతులకు ఏటా ఇచ్చే రూ.13, 500 అక్టోబర్ నాటికి రూ.9 వేలు రైతులకు అందేది. కానీ నేటి కూటమి ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. రెండు విడతల్లో పీఎం కిసాన్ ద్వారా రూ.4 వేలు మాత్రమే రైతులు అందుకున్నారు. .



గత నెలలో వచ్చిన వరదలకు నీట మునిగిన పంట చేలు

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆపన్న హస్తం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకంతో సాగుదారులకు మొత్తంగా రూ.18.30 కోట్లు అందజేసింది. ఇందులో 2019–2020లో 2896 మంది రైతులకు రూ.3 కోట్ల 90 లక్షల 96 వేలు అందించింది. మరుసటి ఏడాది 2020–2021లో రూ.3 కోట్ల 93 లక్షల 52 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. మూడో ఏడాది 2021–2022లో మరో 2727 మంది రైతులకు రూ.3 కోట్ల 68 లక్షల 14500 అందించి రైతుల మన్ననలు పొందింది. 2022–2023లో 2623 మందికి రూ.3 కోట్ల 54 లక్షల 10 వేల 500, ఆఖరి సంవత్సరంలో 2614 మంది సాగుదారులకు రూ.3 కోట్ల 23 లక్షల 61 వేలు అందజేసింది. మొత్తంగా ఐదేళ్లలో రూ.18 కోట్ల 30 లక్షల 34 వేల 500 రైతుల ఖాతాల్లో జమ చేసి సాగు పండుగ చేసింది. నేటి కూటమి ప్రభుత్వం రైతుకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం విచారకరం.

పంట నష్టంపై నివేదిక ఇచ్చాం



అన్నదాత సుఖీభవ పథకం గురించి పూర్తి వివరాలు ప్రభుత్వం, ఉన్నతాధికాలు ప్రకటిస్తారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు, కౌలు రైతుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. కిందటి నెల వచ్చిన వరదలకు నీట మునిగిన పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించాం. దీనిపై ప్రభుత్వం ఏకరాకు రూ.10 వేల పంట నష్టం పరిహారం ఇస్తుందని ప్రకటన చేసింది. త్వరలో పరిహారం అందిస్తుంది.

జీవన సంధ్య, మండల వ్యవసాయాధికారి

పంటల బీమా పరిహారం అందించాలి



కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తారో లేదో అనే అనుమానం రైతుల్లో వ్యక్తమవుతుంది. కూటమి ప్రభుత్వం పథకం అమలు చేయాలి. దీనిపై స్పష్టంగా ప్రకటన చేయాలి. ఇప్పటికే రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్నారు. జిల్లాలో వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట చేలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకూ నష్ట పరిహారం పూర్తిగా అందించలేదు. కె.శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

త్యాగశీలి పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): తెలుగువారికి భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడి ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించిన త్యాగశీలి, స్వాతంత్ర సమరయోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పలువురు వక్తలు కొనియాడారు. నిక ఆర్ఆర్ పేటలోని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. ముందుగా క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు కింజంగి రాజు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నూలు దండ వేసి జోహార్లు అర్పించారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన యోధుడు పొట్టి శ్రీరాములని 56 రోజులపాటు మద్రాసు నగరంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుని ఆత్మ బలిదానం చేసుకుంటే తప్ప కేంద్ర ప్రభుత్వం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వలేదని గుర్తు చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ఎం.ఇసాక్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో అందరూ పని చేయాలని తెలిపారు.

పింఛన్ల కోసం పడిగాపులు



పింఛన్ కోసం వస్తున్న వృద్ధురాలు



పింఛన్ కోసం వృద్ధుడి పరిస్థితి



పింఛన్ కోసం వృద్ధుడి పడిగాపులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. ఒకటో తేదీ రాగానే పింఛన్ ఇంటికి వచ్చి ఇచ్చే పరిస్థితి ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా ఏదోక సమస్యతో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఏలూరులో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే, అధికారులతో ఆర్భాటంగా మొదలైన పింఛన్ పంపిణీ గంటలోనే సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలైనా తమకు పింఛను సొమ్ము అందలేదని లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతూ... కొంతమంది సచివాలయం వద్దే పడిగాపులు పడటం కనిపించింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



ఏలూరు 36వ డివిజన్ సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు



44వ డివిజన్ సచివాలయం వద్ద పింఛన్ కోసం వృద్ధుల పడిగాపులు

విద్యార్థుల ఏక్తా దివస్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కళాశాల బాలికలు

ఏలూరు రూరల్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ పుట్టిన రోజు సందర్భంగా ఏలూరులో ఏక్తా దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద నుంచి కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్టేడియం గ్యాలరీపై చేరిన పలు కళాశాల, పాఠశాల విద్యార్థులచే ఎంఈవో ఆర్.రంగయ్య దేశ ఐక్యత సాధిస్తామంటూ ప్రమాణం చేయించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్, పీడీ అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకేలో పటేల్‌కు నివాళి

స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో అధికారి దూలం కిషోర్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన పటేల్ హోమ్ మినిస్టర్‌గా తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని ఐక్యంగా ఉంచాయని కొనియాడారు.

4న ఉచిత ధ్యాన శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 4వ తేదిన స్థానిక సత్రంపాడులోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉచిత ఆత్మజ్ఞాన, ధ్యాన శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పీఎస్ఎస్ఎన్ ఏలూరు శాఖ నిర్వాహకురాలు మంజులత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ప్రముఖ స్పిరిచ్చువల్ సైంటిస్టు, హిప్నాటిస్ట్ ఉమాచంద్ హాజరవుతారని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచిత భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	17

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	12
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు – తిరుపతి	16.00	4830	03

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36–40	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	76	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44–50	ములక్కాడలు	07,10
బెండకాయలు	32	కంద	68
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	52
కాకర కాయలు	44–48	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	140
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50–60	పాలకూర	15
దొండకాయలు	36	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30–50	బఠాణీ	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	92
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసానికి తెలుగు గడ్డపై ఒక విశిష్ట స్థానం ఉంది. ఈ మాసంలోనే అయ్యప్పస్వామి మాలధారణతోపాటు వివిధ స్వాముల మాలధారణలు చేసి భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతుంటారు. తెల్లవారు జామునే నిద్ర లేచి స్నానాదులు ఆచరించి నిష్టాగరిష్టతతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీక మాసోత్సవాలకు నగరం ముస్తాబయింది. నగరంలోని వివిధ శైవ క్షేత్రాల్లో ఆలయ ప్రతినిధులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆకాశ దీప పూజలు, విశేష హారతి సేవలు, లక్ష కుంకుమార్చనలు, జ్వాలా తోరణాలు, శాంతి కల్యాణాలు, తదితర పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

విశేష రోజులివే

శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం ఈ ఏడాది నవంబర్ 2వ తేదీ అంటే శనివారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, గోపూజలు, ఆకాశదీప పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 4వ తేదీన ప్రథమ కార్తీక సోమవారం రాగా 11, 18, 25 తేదీల్లో కార్తీక సోమవారాలు వచ్చాయి. అలాగే ఈ ఏడాది కార్తీక పౌర్ణమి ఈ నెల 15వ తేదీన చోటు చేసుకుంది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చనలు, లక్ష బిల్వార్చనలు నిర్వహించనున్నారు. పుబ్బ నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు సామూహిక లక్ష కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. డిశంబర్ 2వ తేదీన పోలి స్వర్గం పూజలతో కార్తీక మాసం ముగియనుంది.



చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి దేవస్థానం

నగరంలోని శైవ క్షేత్రాల వివరాలు

స్థానిక పత్తేబాదలో శ్రీ చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం, పవర్ పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, దక్షిణపు వీధిలో శ్రీ జలాపహరేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వరస్వామి దేవస్థానం, ఆదివారపుపేట శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థానం, శ్రీ పర్వత వర్ధని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

డిసెంబర్ 13 నుంచి సీపీఎం జిల్లా మహా సభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో సీపీఎం 26వ ఏలూరు జిల్లా మహా సభలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో మూడు రోజుల పాటు నిర్వహించే మహా సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం సీపీఎం 26వ ఏలూరు జిల్లా మహా సభల కరపత్రాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, జిల్లా కమిటి సభ్యులు కె.శ్రీనివాస్, ఏలూరు నగర నాయకులు వీవీవీఎస్ ప్రసాద్ ఆవిష్కరించారు.

ఉపాధ్యాయుల వివరాలు తెలపండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు తెలియజేయాలని ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారులను కోరారు. ఈ మేరకు కార్పొరేషన్‌లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, తెలుగు, హిందీ, గణితం, పీఎస్, ఎన్ఎస్, సోషల్, సంస్కృతం, స్పెషల్ గ్రేడ్ టీచర్ల శాంక్షన్ పోస్టుల వివరాలు తెలపాలని విద్యాశాఖాధికారిని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అలాగే ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఇంత వరకు ఏఏ రోస్టర్ వరకు పదోన్నతి కల్పించారో, బ్యాగ్‌లాగ్ పోస్టుల వివరాలు కూడా తెలియజేయాలని కోరారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: నగరంలో ఒక వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతిపై పరిసర ప్రాంతాల ప్రజల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలల్లోకి వెళితే.. ఏలూరు సాయినగర్ గణేష్ కాలనీలో నివాసం ఉంటున్న పి.రమణమ్మ (64) భర్త చనిపోవటంతో ఒంటరిగా జీవిస్తుంది. ఆమె ఇంటిలోనే ప్రక్క గదిలో మనవరాలు ఉంటుంది. ఇటీవల విద్యుత్ బిల్లులు చెల్లించే విషయంలో ఇద్దరి మధ్య గత నెల 29న గొడవ జరిగింది. అనంతరం మనవరాలు పావని లంకపేటలోని తన అత్తంటికి వెళ్లిపోయింది. గత నెల 31న వృద్ధురాలు రమణమ్మకు గుండెపోటు రావడంతో స్థానికులు ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా ఆమె చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. అయితే మనవరాలు రమణమ్మను కొట్టి తిట్టిందని అందుకే ఆమెకు గుండెపోటు వచ్చిందని స్థానికులు ఎవరో 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏలూరు నగరంలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు గురువారం ఘనంగా నిర్వహించాయి. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల, పరిశ్రమల సంరక్షణ దినంగా ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపన దినోత్సవాన్ని ఏఐటీయూసీ శ్రేణులు ఏలూరులో నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన్నవ కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, కడుపు కన్నయ్య, ఏఐటీయూసీ నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు, పుప్పాల శ్రీనివాసరావు, చింతపల్లి కూర్మారావు, పోలా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.